నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్‌: విద్యుత్‌ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎర్రన్న తెలిపారు. 11 కేవీ శివాజీనగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు సంతోష్‌నగర్‌, శివాజీనగర్‌, సుక్కమ్మకుంట, సుభద్రమ్మ కాలనీ, మార్వాడి లైన్‌, విఘ్నేశ్వరి కాలనీ, వీకే.ఎన్‌క్లేవ్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

శామీర్‌పేట్‌: ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముదిరాజ్‌లు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ముదిరాజ్‌ మహాసభ ఆధ్వర్యంలో శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండల తహసీల్దార్‌ కార్యాలయాల్లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చుతామని ఇచ్చిన హామీ మేరకు ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు, కుంటలు, మత్స్య సంపదపై తెనుగు, ముత్తిరాశి, ముదిరాజ్‌, బెస్త, గంగపుత్ర, గూండ్ల కులాలకు మాత్రమే హక్కులు ఉండేలా చట్టపరమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి రూ. 1000 కోట్ల నిధులు కేటాయించి, 75 శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలను చేపట్టాలని డిమాండ్‌ చేశారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కీసర: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. కీసర పోలీస్‌ స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటయ్య సమాచారం మేరకు... యాద్రాద్రి–భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రికి చెందిన ఆనంద్‌కుమార్‌ తమ గ్రామంలో జాతర ఉండటంతో భార్య కవిత(28), ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై కుషాయిగూడలో దుస్తుల కొనుగోలుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా కీసర పోలీస్‌స్టేషన్‌ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో వెనుక కూర్చున్న కవిత రోడ్డుపై పడి తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కవితను చికిత్స నిమిత్తం 108 వాహనంలో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కవిత మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత

పోచారం: నారపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు క్రొవ్విడి ప్లస్‌ ఫౌండేషన్‌ ప్రతినిధులు క్రీడా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ బడిలో చదువుకునే విద్యార్థులు క్రీడల్లో రాణించాలని క్రికెట్‌, షటిల్‌, బ్యాడ్మింటన్‌, చెస్‌, క్యారమ్స్‌, రింగ్‌బాల్‌, స్కిప్పింగ్‌ తదితర ఆటలకు సంబంధించిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ అధ్యక్షుడు హరగోపాల్‌, హెచ్‌ఎం శ్యాంప్రసాద్‌, సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్మానం



ఎంపీడీఓ గ్యామ నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కీసర: ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా కీసర ఎంపీడీఓ గ్యామ నాయక్‌ను భోగారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... యువత ఎంపీడీఓ గ్యామ నాయక్‌ను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. మండల పరిషత్‌ సిబ్బంది, బీజేపీ నేతలు నాయకులు గోసుల శ్రీనివాస్‌, దుర్గం వేణుగోపాల్‌, నాగరాజు, చారి తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీమ్‌కు నివాళి

జవహర్‌నగర్‌: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌లో శుక్రవారం మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో కొమురం భీమ్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు శ్యామలత, స్వరూప మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల కోసం ప్రత్యేక చట్టాలు తెచ్చినా ఆచరణకు నోచుకోలేదన్నారు. ఆదివాసీలంతా ఏకమై హక్కులను సాధించుకుందామన్నారు. ఆదివాసీలకు నివాస యోగ్యం కల్పించి, ఆరోగ్యంపై దృష్టి సారించి, ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్‌, యాదగిరి, రాజేశ్వరి, ఎల్లమ్మ, మల్లీశ్వరి, నర్సింహా, అశోక్‌, నగేష్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

కీసర: నియోజకవర్గం పరిధిలోని దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలను అందించనున్నట్లు మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలోని ఇందిరానగర్‌కాలనీలో నిర్వహిస్తున్న రేణుకాఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీవాసులు సమష్టిగా రేణుకా ఎల్లమ్మ దేవాలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమని... వంశరాజ్‌ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంశరాజ్‌ మల్లేష్‌ నేతృత్వం వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. మున్సిపల్‌ చైర్మన్‌ వసుపతి ప్రణితాశ్రీకాంత్‌గౌడ్‌, కౌన్సిలర్లు వెంకటేష్‌, కొత్తసురేఖ, కొత్త హేమలత, నానునాయక్‌, రమేష్‌గౌడ్‌, మోర మౌనిక, నేతలు కొత్త భాస్కర్‌గౌడ్‌, శ్రీనివాస్‌గౌడ్‌, అనిల్‌కుమార్‌, తిరుపతిరెడ్డి, నరహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వనమహోత్సవం

మేడ్చల్‌: వనమహోత్సవంలో భాగంగా పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్‌ సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి అందరూ మొక్కలు నాటాలని కోరారు. స్మార్ట్‌ లివింగ్‌ ప్రోగ్రాంలో భాగంగా వనమహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ నాగిరెడ్డి, కౌన్సిలర్‌ మర్రి శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో...

మేడ్చల్‌రూరల్‌: ప్రతి ఒక్కరూ పచ్చదనానికి పాటు పడాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్‌ స్వామి అన్నారు. స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ఇంటిగ్రేటెడ్‌ వెజ్‌–నాన్‌వెజ్‌ మార్కెట్‌ యార్డు ప్రాంగణం, పట్టణ ప్రకృతి పార్క్‌లో మున్సిపల్‌ పాలకవర్గ సభ్యులు, అధికారులు, స్వయం సహాయక సంఘాలు, యువతతో కలిసి మొక్కలు నాటారు. వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, మేనేజర్‌ శ్రీనివాస్‌గౌడ్‌ డీఈ దుర్గాప్రసాద్‌, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బండరాళ్లతో... ఎన్ని సమస్యలో?



చెక్‌పోస్టు వద్ద మేడ్చల్‌–గండిమైసమ్మ రోడ్డులో రోడ్డు పక్కన ట్రాఫిక్‌ పోలీసులు ఏర్పాటు చేసిన భారీ బండరాళ్లు

మేడ్చల్‌–గండిమైసమ్మ రోడ్డు పక్కనే పెద్ద రాళ్లు

అక్రమ పార్కింగ్‌ సమస్యను తీర్చేందుకే ఏర్పాటు

అసాంఘిక కార్యకలాపాలకు ఊతమిస్తోందంటూ ఆందోళన

మేడ్చల్‌: ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్‌ పోలీసులు చేసిన ఉపాయం సమస్యను మరింత పెంచేదిగా ఉందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక సమస్య పరిష్కరించడానికి మరో సమస్యను సృష్టించేదిగా తయారైంది. ఆ ఉపాయం కాస్తా ప్రమాదాలతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు తావిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.

- మేడ్చల్‌ నుంచి గండిమైసమ్మ రోడ్డులో చెక్‌పోస్టు నుంచి సుతారిగూడ చెరువు వరకు లారీలు రోడ్డు పక్కన నిలుపుతున్నారని.. అక్రమంగా పార్కింగ్‌ చేయడంతో సమస్యలు వస్తున్నాయని మేడ్చల్‌ ట్రాఫిక్‌ పోలీసులు పెద్ద పెద్ద బండరాళ్లను రోడ్డు పక్కన పెట్టారు.
- తవ్వకాల్లో లభించే పెద్ద రాళ్లను సుతారిగూడ చెరువు నుంచి చెక్‌పోస్టు వచ్చే రోడ్డులో వ్యవసాయ క్షేత్రాలు ఉన్న వైపు వరుసగా పెట్టారు. రాళ్లను చెక్‌పోస్ట్‌ కూడలి వరకు పేర్చి వాటికి తెల్లరంగు కూడా వేశారు.
- మేడ్చల్‌ చెక్‌ పోస్టు ప్రాంతం మేడ్చల్‌లో లారీల అడ్డా. లారీల వ్యాపారానికి కేంద్రంగా చెక్‌పోస్టు ఉంటుంది. ట్రాన్స్‌పోర్టులు, దూర ప్రాంతాలకు వెళ్లే లారీలు ఎక్కువగా ఉంటాయి. సమీపంలో ఔటర్‌రింగు రోడ్డు ఉండటంతో నో ఎంట్రీ సమయంలో లారీల డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా లారీలను అక్కడే పార్కింగ్‌ చేస్తుంటారు. దీంతో సుతారిగూడ వరకు తరుచూ ట్రాఫిక్‌ జాం సమస్య నెలకొంటోంది.
- రోడ్డు పక్కనే లారీలు నిలుపుతుండటంతో చీకటిపడితే చాలు ఆ ప్రాంతం కాస్తా అసాంఘిక కార్యక్రమాలు అడ్డాగా మారుతోంది. చెక్‌పోస్టు ప్రాంతంలో ఎక్కువగా స్థలం లేకపోవడం, పారిశ్రామిక ప్రాంతం కావడంతో లారీల రాకపోకలు ఎక్కువగా సాగుతున్నాయి.



ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ...

లారీలు పార్కింగ్‌ చేయకుండా బండ రాళ్లు రోడ్డు పక్కన పెట్టిన కొర్ది మేర సమస్యకు పరిష్కారం చూపినా అది మంచి ఆలోచన కాదనే అభిప్రాయం ఎక్కువగా వ్యక్తం అవుతోంది. రోడ్డు పక్కన రాళ్లను ఏర్పాటు చేయడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ద్విచక్ర వాహనదారులు వాటిపై పడితే వారి సంగతి అంతే. రాళ్లను ఢీకొనడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

- ఈ దారిలో మల్లారెడ్డి, హితం, ఎంఎల్‌ఆర్‌బీ కళాశాలలకు చెందిన వందల మంది ఇంజినీరింగ్‌ విద్యార్థులు ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు.
- కొందరు యువకులు ఈ ప్రాంతంలో ఏదైనా ప్రమాదానికి గురై రోడ్డు పక్కన పడితే గాయాలతో ప్రాణాలకు గ్యారంటీ ఉండదంటే అతిశయోక్తికాదు.
- అధికారులు సమస్యను తీర్చడానికి ఏర్పాటు చేసిన బండరాళ్లు సమస్యలను తీర్చడం కంటే సమస్యను ఎక్కువగా చేసేవిగా ఉన్నాయి. లారీలను డ్రైవర్లు అక్రమంగా పార్కింగ్‌ చేసి సమస్యలు తెస్తున్నారని ఇలాంటి విచిత్ర పనులు చేయడం కంటే లారీల డ్రైవర్లకు పలుమార్లు కౌన్సిలింగ్‌ ఇవ్వడం లేదా భారీగా జరిమనాలు విధించడం, ట్రాన్స్‌పోర్ట్‌ ఓనర్లతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి వారికి పార్కింగ్‌ స్థలాలు చూపాలి. అంతేగానీ సమస్య ఉందని వారి కోసం ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం సబబు కాదని మెజారిటీ ప్రజలు పేర్కొంటున్నారు.



సమస్య పరిష్కారానికే బండరాళ్లు...

మేడ్చల్‌–గండిమైసమ్మ రోడ్డులో చెక్‌పోస్టు నుంచి సుతారిగూడ వైపు ఏర్పాటు చేసిన బండరాళ్లు ఆ ప్రాంతంలో సమస్యలను పరిష్కరించేందుకే ఏర్పాటు చేశాం. లారీల డ్రైవర్లకు ఎన్ని సార్లు చెప్పినా రోడ్డుపైనే పార్క్‌ చేయడం వల్ల తరుచూ సమస్యలు నెలకొంటున్నాయి. రాత్రి వేళల్లో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజల సమస్యలను తీర్చడానికి ఇలాంటి చర్యలు తీసుకోకతప్పలేదు. బండరాళ్ల వల్ల ప్రమాదం జరగకుండా తెల్లరంగులు వేయించాం. త్వరలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయిస్తాం.

– హనుమాన్‌గౌడ్‌, మేడ్చల్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌

వైభవంగా నాగుల పంచమి





కీసరగుట్ట, మేడ్చల్‌లో నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

కీసర: శ్రావణమాసం నాగుల పంచమి సందర్భంగా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి, చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయాలతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తులు నాగుల పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకొన్నారు. శుక్రవారం నాగుల పంచమి సందర్భంగా కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరుడికి నానావిధ ఫల రసాభిషేకం పూజను పండితులు కనుల పండువగా నిర్వహించారు. అనంతరం నాగదేవత ఆలయంలో నిర్వహించిన ప్రత్యేకపూజల్లో ఆలయ చైర్మన్‌ తటాకం నాగలింగం పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో ఉదయం నుంచే మహిళలు నాగుల పుట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన పుట్టలో పాలు పోసి మొక్కులను చెల్లించుకున్నారు. చీర్యాల దేవాలయం వద్ద గల పుట్ట వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆలయ చైర్మన్‌ మల్లారపు లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొన్నారు. కీసరగుట్ట ఈఓ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లారపు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో...

మేడ్చల్‌: మహిళలు భక్తి శ్రద్ధలతో నాగదేవతను కొలిచే నాగుల పంచమి వేడుకను మహిళలు మేడ్చల్‌ మున్సిపాలిటీలో శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాలలో వివిధ ఆలయాల వద్ద ఉన్న పాము పుట్టల వద్ద పాలు పోసి, పసుపు కుంకమలతో పూజలు చేసి పండ్లు పుట్నాలు, బెల్లం ప్రసాదంగా పెట్టి పూజలు చేశారు. అత్వెల్లి పోచమ్మ ఆలయం, మేడ్చల్‌ వినాయక్‌నగర్‌ ఎల్లమ్మ ఆలయం, కట్టమైసమ్మ ఆలయం వద్ద మహిళల రద్దీ నెలకొంది.

కమనీయం.. గోదారంగనాయకస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్‌ శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్‌: ఎదులాబాద్‌ శ్రీ గోదాసమేత శ్రీ మన్నారు రంగనాయక స్వామి వారి రథోత్సవం శుక్రవారం ఆలయ ధర్మకర్తలు కనుల పండువగా నిర్వంచారు. ఆలయం నుంచి చౌరస్తా వరకు రథాన్ని ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్‌ శరత్‌చంద్రారెడ్డి, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్‌, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, బీ బ్లాక్‌ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌, మండల అధ్యక్షుడు రాజేశ్‌ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి

జవహర్‌నగర్‌: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కమిషనర్‌ తాజ్‌మోహన్‌రెడ్డి, ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్‌, మేయర్‌ శాంతి, డిప్యూటీ మేయర్‌ శ్రీనివాస్‌, కార్పొరేటర్‌ వేణు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌ సుష్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ కృష్ణప్ప, పాండు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అడిషనల్‌ కలెక్టర్‌ రాధికాగుప్తా



మొక్కలు నాటుతున్న అడిషనల్‌ కలెక్టర్‌ రాధికాగుప్తా

మేడ్చల్‌: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ (లోకల్‌బాడీస్‌) రాధికాగుప్తా మేడ్చల్‌లో మొక్కలు నాటారు. పట్టణంలోని ఐటీఐ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వహించిన వనమహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఐటీఐ ఆవరణలో 1020 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కల కోసం ఏర్పాటు చేసిన హార్వెస్టింగ్‌ పిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో చైర్‌ పర్సన్‌ దీపిక నర్సింహారెడ్డి, వైస్‌ చైర్మన్‌ రమేష్‌, కమిషనర్‌ నాగిరెడ్డి కౌన్సిలర్లు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కొడే మహేష్‌, ఉమానాగరాజు, ఐటీఐ ప్రిన్సిపాల్‌ హనుమాన్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



ఘట్‌కేసర్‌లో మొక్కలు నాటుతున్న కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ ఇంచార్జి వజ్రేష్‌ యాదవ్‌

ఘట్‌కేసర్‌: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వారిని సంరక్షించుకోవాలని... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్‌ యాదవ్‌ పిలుపునిచ్చారు. శుక్రవారం ఘట్‌కేసర్‌లోని ఈడబ్ల్యూఎస్‌ సర్కిల్‌ నుంచి విజ్ఞాన్‌ కాలేజ్‌ వరకు ఇంజినీరింగ్‌ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... స్వచ్ఛమైన వాయువు కోసం పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. చైర్‌ పర్సన్‌ ముల్లి పావని జంగయ్య యాదవ్‌, ప్రత్యేక అధికారి సాబేర్‌ అలీ, కాంగ్రెస్‌ పార్టీ బీ బ్లాక్‌ అధ్యక్షుడు వేముల మహేష్‌ గౌడ్‌, మాజీ సర్పంచ్‌ అబ్బసాని యాదగిరి యాదవ్‌, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్‌, కౌన్సిలర్లు కొమ్మగోని రమాదేవి మహిపాల్‌ గౌడ్‌, బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డి, శశికళ దేవేందర్‌ ముదిరాజ్‌, కడుపొల్ల మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ మార్కెట్‌ రోడ్డులోని శ్రీరామాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్‌ కావ్య ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి, మేక లలితాయాదవ్‌, నవీన్‌కుమార్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు భార్గవ్‌రామ్‌, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను సంరక్షించండి

- భూసర్వేను నిర్వహించి, గూగుల్‌లో పొందుపరచండి
- మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌



మాట్లాడుతున్న కలెక్టర్‌ గౌతమ్‌

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ భూములను పరిరక్షణకు పైలెట్‌ ప్రాజెక్టు కింద భూ సర్వేను నిర్వహించి, కేఎంఎల్‌ మ్యాప్‌ (గూగుల్‌)లో పొందుపరచాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్‌ గౌతమ్‌ పొట్రు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో జిల్లాలోని ప్రభుత్వ భూముల సర్వేపై జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డితో కలిసి ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు కచ్చితమైన ప్రమాణాలతో జిల్లాలోని నిషేధిత భూములు, రక్షణ శాఖ, అటవీశాఖ, సీలింగ్‌, అసైన్డ్‌ భూములు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన భూములను సర్వే చేసి, ఎలాంటి పొరపాటు లేకుండా పక్కాగా వివరాలను సేకరించాలన్నారు. సాంకేతికంగా కీహోల్‌ మార్కప్‌ లాంగ్వేజ్‌ (కేఎంఎల్‌) మ్యాప్‌ (గూగుల్‌)లో త్వరితగతిన పొందపరచాలని కలెక్టర్‌ గౌతమ్‌ రెవెన్యూ అధికారులకు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్‌లో భాగంగా లే అవుట్ల రెగ్యులరైజేషన్‌ బిల్డింగ్‌ పర్మిషన్లు టీజీ ఐపాస్‌ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి కేఎల్‌ఎం మ్యాప్‌లో సూచించిన భూముల వివరాల ప్రకారం అనుమతులు ఇచ్చేందుకు సులభతరం అవుతుందన్నారు. మల్కాజిగిరి, కీసర ఆర్డీవోలు, రాజేష్‌కుమార్‌, ఉపేందర్‌రెడ్డి, 15 మండలాలకు చెందిన తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

కలెక్టరేట్‌ ఆవరణలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధతో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ గౌతమ్‌ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికాగుప్తా (లోకల్‌ బాడీస్‌), విజయేందర్‌ రెడ్డి (రెవెన్యూ)తో కలసి జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే స్టాల్స్‌ ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్‌ గౌరవ వందనం స్వీకరణ, పోలీసు బందోబస్తు, స్టేజ్‌, సీటింగ్‌, తాగునీరు, పారిశుద్ధ్యం చర్యలను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. గౌరవ ముఖ్య అతిథి ప్రసంగం రూపొందించాలన్నారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉత్తమ సేవలందించే ఉద్యోగులను గుర్తించి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాల కోసం ప్రతిపాదనలు పంపాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ బలవన్మరణం

కీసర: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ గృహిణి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్‌ పరిధి నాగారం కె కె గార్డెన్‌ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామానికి చెందిన గ్రీష్మారెడ్డి (28)కి జనగాం జిల్లా రాళ్లజనగాంకి చెందిన సప్పిడి భాస్కర్‌రెడ్డితో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు. వీరు ఏడాది కాలం నుంచి నాగారం కెకె గార్డెన్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కాగా కొద్దికాలంగా భార్య భర్తల మధ్య విభేదాలు తలెత్తి గొడవలు జరిగాయి. శుక్రవారం సాయంత్రం భర్త లేని సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న గ్రీష్మారెడ్డి సీలింగ్‌ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఘటనపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. భర్త, అత్తమామలే గ్రీష్మారెడ్డి మృతికి కారణమని ఆరోపించారు. పోలీసులు వచ్చేలోగా ఫ్యాన్‌కు వేలాడుతున్న మృతదేహాన్ని కిందికి దింపడంపై అనుమానం వ్యక్తంచేశారు. సంఘటనా స్థలాన్ని కుషాయిగూడ ఏసీపీ టి.మహేష్‌ సందర్శించారు.



గ్రీష్మారెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగస్వామ్యం కావాలి

మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



దమ్మాయిగూడలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

కీసర: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ మలేరియా, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మేడ్చల్‌ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం డ్రైడే–ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... ఇంటి పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు ఉండకుండా చూడాలని, మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చెత్తను తొలగించుకోవాలని సూచించారు. ఇళ్లలోని పూల కుండీల్లో నీటిని రెండు రోజులకోసారి మార్చాలన్నారు. దీంతో పాటుప్రతి ఒక్కరు తమ ఇళ్ల ముందు మొక్కలను నాటడంతోపాటు వాటిని పరిరక్షించేందుకు ప్రతి రోజు నీటిని అందజేయాలన్నారు.

- నాగారంలో నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు. 17వ వార్డులోని ఎస్సీ కాలనీ ప్రైమరీ స్కూల్‌, అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రపరిచే కార్యక్రమంతోపాటు, ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పంక్చర్‌షాపులు, పాత సామాన్ల దుకాణాల్లో ప్లాస్టిక్‌ డబ్బాల్లో, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించే పనుల్లో ఆయన పాల్గొన్నారు.
- దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలను శుభ్రంచేయడం, మురికి కాలువలను శుభ్రపరచే కార్యక్రమాలను మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ ప్రణితాగౌడ్‌, కమిషనర్‌ నాగమణి పర్యవేక్షించారు.
- ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రౌండ్‌ వాటర్‌ ఆఫీసర్‌ (స్పెషల్‌ ఆఫీసర్‌) రేవతి, మున్సిపల్‌ కమిషనర్‌ రాజేంద్రకుమార్‌, వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, కౌన్సిలర్లు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.